## క్లుప్తంగా...

### ఈ నెల 13న ఎగ్జిబిషన్

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ జనప్రియ అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలో ఈ నెల 13వ తేదీన ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కేసీరాజు విజయ సుబ్రహ్మణ్యం ఫౌండేషన్(కేవీఎస్) ఆధ్వర్యంలో ప్రతి రెండో శనివారం ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. జ్యూవెలరీ, చీరలు, స్టేషనరీ, స్పోర్ట్స్ సామగ్రి, స్వీట్స్, స్నాక్స్, పికిల్స్, హెల్త్, ఫుట్ మసాజ్, టాయిస్, గిఫ్ట్స్, ఎలక్ట్రిక్ బైక్స్, రియల్ ఎస్టేట్ ఆఫర్స్ తదితర వాటిని ఈ ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంటాయన్నారు.

### అనుమతి లేని నిర్మాణంపై ఫిర్యాదు

శంషాబాద్: మున్సిపాలిటీలోని పదో వార్డులో అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రమాదకరంగా చేపడుతున్న నిర్మాణాన్ని అడ్డుకోవాలని కాంగ్రెస్ నాయకుడు పరమేష్‌గౌడ్ మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పరమేష్‌గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాన్ని నిలుపుదల చేయడానికి మున్సిపల్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని చర్యలు చేపట్టేందుకు అధికారులు వెనుకంజ వేయడానికి గల చట్టపరమైన కారణాలను స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని పట్టణాభివృద్ధి శాఖ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

### దేవాలయ భూమి ఆక్రమించారంటూ ఫిర్యాదు

మణికొండ: దేవాదాయ శాఖకు చెందిన భూమిని పక్కనే భవనం నిర్మిస్తున్న ఓ బిల్డర్ ఆక్రమణకు పాల్పడుతున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ ఈఓ సత్య చంద్రారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని సర్వేనెంబర్ 126లో 6.08 ఎకరాల భూమి ఉంది. అందులోనే పోచారం గుట్ట ఆంజనేయస్వామి దేవాలయం ఉంది. దానిని ఆనుకునే ఉన్న ప్రైవేటు భూమిలో ఓ బిల్డర్ అపార్ట్‌మెంట్‌ను నిర్మిస్తున్నారు. అతను దేవాదాయ శాఖ భూమిలో కొంత చదును చేసి అందులో కంటైనర్ ఏర్పాటు చేసి ఆక్రమణకు పాల్పడుతున్నాడని స్థానికులు దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా మంగళవారం ఈఓ సత్య చంద్రారెడ్డి వచ్చి పరిశీలించి సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసి భూమి సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలని గండిపేట తహసీల్దార్‌ను కోరారు.

### ప్రహరీ కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఇరిగేషన్ ఎస్ఈకి ఫిర్యాదు చేస్తున్న కృష్ణ

మణికొండ: తన పొలానికి నిర్మించుకున్న ప్రహరీని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ గ్రామానికి చెందిన టి. కృష్ణ, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామ సర్వే నెంబర్ 226/రులో 1.10 ఎకరాల తన భూమి ఉందని దాని చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నానన్నారు. ఈ నెల 3వ తేదీన ఎలాంటి నోటీసు, సమాచారం లేకుండా వచ్చి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తన ప్రహరీని కూల్చారన్నారు. తనను గతంలో ఇద్దరు అధికారులు రూ. 2 లక్షలు డిమాండ్ చేశారని, అవి ఇవ్వకపోవడంతోనే తన ప్రహరీ కూల్చారని వినతిలో కోరారు.

### మూగజీవాలను రోడ్లపై వదలొద్దు

బండ్లగూడ: రోడ్లపై మూగ జీవాలను వదలడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. గాయత్రీనగర్‌లో ఓ ఆవు దూడకు జన్మనిచ్చి మృతి చెందింది. విషయం తెలుసుకున్న మేయర్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పశువులను రోడ్లపై వదిలేస్తుండటంతో చెత్త చెదారాలు తింటూ ప్రమాదాలకు గురవుతున్నాయని ఎవరూ రోడ్లపైకి మూగజీవాలను వదలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

### ప్రతిఒక్కరూ మానవత్వం చాటుకోవాలి

గోల్కొండ: ప్రతిఒక్కరూ మానవత్వం చాటుకోవాలని కేసరి హనుమాన్ యువసంఘటన ప్రధాన కార్యదర్శి రక్షిత్‌సాగర్ అన్నారు. కార్వాన్‌కు చెందిన ఓ ఆరేళ్ల నిరుపేద బాలుడు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలిసిన కేసరి హనుమాన్ యువసంఘటన్ వారు దాతల సహకారంతో వచ్చిన డబ్బులతో బాలుడికి గుండె శ్రస్త చికిత్స నిర్వహించారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఆ బాలుడు తన తల్లి, నానమ్మతో కేసరి హనుమాన్ యువ సంఘటన్, మహేష్ బాబు ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.



అక్షయ బైపీసీ (431)



బి.తరుణిక ఎంపీసీ (464)



ఉర్నిత బైపీసీ (984)



దీప్తి దర్శిని ఎంపీసీలో (980)



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల యాజమాన్యం

# ప్రభుత్వ విద్యార్థులు.. ప్రతిభ చాటారు

**'గురుకుల' సత్తా**

మణికొండ: ఇంటర్ ఫలితాల్లో నార్సింగి సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. మొదటి సంవత్సరం ఫలితాలలో 77 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా ఒకరు మాత్రమే ఫెయిల్ అయ్యి 98.7 ఫలితాలు సాధించగా, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో 73 మంది పరీక్షలు రాయగా నలుగురు ఫెయిల్ అయి 94.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. గ్రూపుల వారీగా మొదటి సంవత్సరం ఎంపీసీలో 97.4, బైపీసీలో 100 శాతం, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 91 శాతం, బైపీసీలో 97.4శాతం ఫలితాలతో రాణించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో బి.తరుణిక 464 మార్కులతో, బైపీసీలో ఎం. అక్షయ 431 మార్కులతో టాపర్‌లుగా నిలిచారని ప్రిన్సిపాల్ కృపావరం తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 980 మార్కులతో ఎం. దీప్తి దర్శని, బైపీసీలో 984 మార్కులతో ఎస్. ఉర్నిత నిలిచారన్నారు.





హారతి బైపీసీ 929 సుమతి హెచ్ఈసీ 965

**శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల ప్రతిభ**

రాజేంద్రనగర్: విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు పట్టుదలతో చదువుకోవాలని శ్రీవైష్ణవి జూనియర్ కళాశాల డైరెక్టర్లు ఎం.శ్రీనివాస్‌గౌడ్, సి.హెచ్.శ్రీనివాస్‌చారీ అన్నారు. ఇంటర్ ఫలితాల్లో భవనీ కాలనీలోని శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నిక్కి కుమారి ఎంపీసీ(495/500), దివాకర్‌శర్మ ఎంపీసీ (464/470), ఆంచల్ ద్వివేది సీఈసీ (489/500) మార్కులతో రాష్ట్రస్థాయిలో నిలిచారు.

**సత్తా చాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు**

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో సత్తా చాటారు. ప్రైవేటుకు దీటుగా ఉత్తమ ప్రతిభ కనబర్చారు. వై. సుమతి హెచ్ఈసీ 965, రజిత ఎంపీసీ 951, హారతి బైపీసీలో 929 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మాధవరెడ్డి తెలిపారు.

**జూనియర్ కళాశాల విద్యార్థులు..**





గణేష్ ఎంపీసీ 986 నాజియా బైపీసీ 977

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎంపీసీలో గణేష్ 986 మార్కులతో మొదటి స్థానంలో నిలిచాడు. ఎంపీసీలో మొత్తం 8 మంది విద్యార్థులకు 920కి పైగా మార్కులు రావడం విశేషం. బైపీసీలో నాజియా 977 మార్కులు సాధించింది. ఆరు మంది విద్యార్థులకు 900కి పైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. సీఈసీలో మంజులకు 973 మార్కులతో మొదటిస్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో సైతం బీచ్‌పల్లి అనే విద్యార్థి 460 మార్కులతో ఎంపీసీలో టాపర్‌గా నిలిచాడు. రాష్ట్రంలోనే ఎంపీసీలో తమ విద్యార్థి అత్యధిక మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ అంజయ్య తెలిపారు.

**మోడల్ స్కూల్ విద్యార్థులు..**

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకులలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో 70 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ విష్ణుప్రియ తెలిపారు. ద్వితీయ సంవత్సరం కే.దివ్య ఎంపీసీలో 978 మార్కులు సాధించగా ప్రతిమాకుమారి మొదటి సంవత్సరం ఎంపీసీలో 461 మార్కులు సాధించిందని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం వివిధ గ్రూపుల నుంచి 118 మందికి 86, రెండో సంవత్సరంలో 145 మందికి 101 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

## పాలవ్యాపారి కూతురు రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంక్..

శంషాబాద్: పట్టణంలోని రాళ్లగూడ బస్తీకి చెందిన పాల వ్యాపారి బండి శ్రీధర్ యాదవ్ కుమార్తె ప్రణతి ఎంపీసీలో 989 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ఏడో ర్యాంకర్‌గా నిలిచింది. 13 వార్డు రాళ్లగూడ కౌన్సిలర్ భాగ్య లక్ష్మి శ్రీకాంత్ యాదవ్ దంపతులు విద్యార్థిని సన్మానించి అభినందించారు.



## అభివృద్ధి పనులను పూర్తి చేయించాలి



బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బల్దియా కమిషనర్ డీఎస్ లోకేష్ కుమార్‌ను ఆయన మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన కార్వాన్ నియోజకవర్గం అభివృద్ధి, జరుగుతున్న అభివృద్ధి పనులు తదితర విషయాలపై చర్చించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు టెండర్లు పొందిన కాంట్రాక్టర్లు పనులు సకాలంలో పూర్తి చేయడం లేదన్నారు. దీని వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి, రోడ్ల విస్తరణ పనులు మందగించాయని ఆయన బల్దియా కమిషనర్ దృష్టికి తెచ్చారు. జోనల్ స్థాయి బల్దియా అధికారులు సైతం పనులు పూర్తి చేయించడంలో శ్రద్ధ కనబర్చడంలేదని ఆయన అన్నారు. అకాల వర్షాలతో గోల్కొండ, కార్వాన్, టోలిచౌకి, నానల్‌నగర్ డివిజన్లలో రోడ్లు బాగా దెబ్బతిన్నాయని, వాటికి వెంటనే పక్కా పనులు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. జోనల్ స్థాయి అధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేయిస్తానని, అవసరం అయితే తాను కూడా కార్వాన్ నియోజకవర్గంలో పర్యటిస్తానని ఎమ్మెల్యేకు కమిషనర్ హామీ ఇచ్చారు.

## ఆలయాల అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తాం



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆలే భాస్కర్ రాజ్, గాజుల అంజయ్య తదితరులు

చార్మినార్: ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలకు చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం వెంటనే ఆలయాల వద్దకు వెళ్లి ఆయా ఆలయాల వద్ద చేపట్టాల్సిన పనులను పర్యవేక్షిస్తామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ అన్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులతో కలిసి పర్యటిస్తామన్నారు. భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్ అధ్యక్షతన జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ అశోక్ సామ్రాట్‌తో మంగళవారం సమావేశం నిర్వహించారు. గత సంవత్సర బోనాలకు జీహెచ్ఎంసీ చేపట్టిన కంప్లీషన్ రివ్యూ.. 2023 బోనాలకు చేపట్టాల్సిన పనులకు సంబంధించిన వినతిపత్రం అందజేశారు. మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు గాజుల అంజయ్య, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఉపాధ్యక్షులు ఎస్.పి.క్రాంతి కుమార్, భవానీ శంకర్ గౌడ్, ఆకుల వేణు, శ్రీధర్, ప్యారసాని వెంకటేశ్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి ఉత్సవాల కన్నా ముందే అభివృద్ధి పనులను ప్రారంభించి పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు.

## నిషేధిత విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



జియాగూడ: నిషేధించబడిన విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు చూసింది. వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఖలీల్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. బేగంబజార్‌కు చెందిన పాత నేరస్థుడు విపుల్ రాంక (38) బేగంబజార్ అజీజ్ ప్లాజాలో కన్‌ఫెక్షనరీ వ్యాపారం చేస్తున్నాడు. అక్రమంగా విదేశీ సిగరెట్లను అమ్మడం, కొనడం, తరలించడం చేస్తుంటాడు. మంగళ్‌హాట్ సీతారామ్‌బాగ్‌లో ఉన్న ప్రగతి ట్రాన్స్‌పోర్టు మేనేజర్ దీపక్ జాదవ్ (28)తో పరిచయం చేసుకుని కన్‌ఫెక్షనరీ వ్యాపారంతో పాటు ఫారిన్ సిగరేట్ల ట్రాన్స్‌పోర్టు ద్వారా తెప్పించుకుంటున్నాడు. ఢిల్లీ నుంచి తక్కువ ధరకే ప్యారిస్ సిగరేట్లను తెప్పించుకుని హైదరాబాద్‌లో అధిక ధరలకు విక్రయిస్తూ డబ్బు సంపాదిస్తున్నాడు. ఈ విదేశీ సిగరెట్లు తెప్పించుకున్న సందర్భంలో కస్టమ్స్ డ్యూటీ, జీఎస్‌టీ సైతం ఎగ్గొడుతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళ్‌హాట్ సీతారామ్‌పేట్‌లో దాడులు నిర్వహించగా రూ.8 లక్షల విలువ చేసే ప్యారిస్ సిగరెట్ల సరుకు లభించింది. నిందితుడు మంగళ్‌హాట్, బేగంబజార్ పోలీస్‌స్టేషన్లలో పాత నేరస్తుడు. తదుపరి విచారణ నిమిత్తం మంగళ్‌హాట్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో ఎస్సై షేక్ కవియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటనా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌కు చెందిన వెంకటేష్(33) సోమవారం బామ్మర్దికి పిల్లను చూసేందుకు భార్యాపిల్లలతో కలిసి హనుమాన్‌నగర్‌కు వచ్చాడు. కుటుంబ సభ్యులందరితో కలిసి పిల్లను చూసి రాత్రికి ఇంటికి వచ్చి నిద్రకు ఉపక్రమించారు. మంగళవారం తెల్లవారుజామున వెంకటేష్ తోడళ్లుడితో కలిసి పత్తికుంట ప్రాంతానికి వచ్చాడు. అతడి వెంట వచ్చిన వ్యక్తి చెరువుకట్టపై ఉండగా పత్తికుంటలోకి వెళ్లిన వెంకటేష్ మునిగిపోయాడు. గమనించి బయటకు తీసి ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

### వాచ్‌మెన్ అదృశ్యం



నర్సింహామూర్తి

శంషాబాద్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణంలోని రాళ్లగూడ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు నివాసముండే నర్సింహామూర్తి (38) స్థానికంగా వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 2న ఇంటి నుంచి బయటికి వెళ్లిన నర్సింహామూర్తి ఎంతకీ రాలేదు. తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం భార్య అనూష ఫిర్యాదు చేసింది.

## అత్తాపూర్ డివిజన్‌లో బీజేపీ స్వశక్తికరణ



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ పాండురంగానగర్ బూత్ నెంబర్-238లో మంగళవారం స్వశక్తికరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. బీజేపీ కేంద్ర, రాష్ట్ర పార్టీ అధ్యక్షుల పిలుపు మేరకు యావత్ భారతావనిలో కొనసాగుతున్న బూత్ స్వశక్తికరణ కార్యక్రమం తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడంలో ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఉన్న 580 బూతుల్లో ఈ కార్యక్రమం చురుగ్గా కొనసాగుతుందన్నారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్ లాంటి విస్తీర్ణంలో జనాభాలో అత్యధిక సంఖ్య కలిగిన ప్రాంతాల్లో బీజేపీ గెలుపు కోసం బూత్ స్వశక్తికరణ ఎంతో దోహదపడిందన్నారు. బూత్ అధ్యక్ష పదవి నుంచి రాష్ట్ర అధ్యక్షుల వరకు బంధాన్ని ఏర్పాటు చేసే ప్రక్రియ బూత్ స్వశక్తికరణ అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణముదిరాజ్, మూల శ్రీనివాస్‌గౌడ్, గొరిటె రాజు, సాయియాదవ్, బాలకృష్ణ, ఉమా, దత్తురావు పాల్గొన్నారు.

### గవర్నర్ ప్రశంస



గవర్నర్‌ను కలిసిన పరమేశ్వరీ

శంషాబాద్: పట్టణంలోని త్రినేత్ర ఫౌండేషన్ చైర్మన్ మడపతి పరమేశ్వరిని రాష్ట్ర గవర్నర్ తమిళిసై ప్రశంసించారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వందమంది టీబీ రోగులను ఫౌండేషన్ ఆధ్వర్యంలో దత్తత తీసుకున్నారు. ఈ విషయమై రెడ్‌క్రాస్ ప్రతినిధులతో కలిసి ఆమె మంగళవారం రాష్ట్ర గవర్నర్‌ను కలిశారు. త్రినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను తెలుసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### సీబీఐటీలో జీరో షాడో డే

మణికొండ: సూర్యుని స్థానం నేరుగా తలపైన ఉన్నప్పుడు, నిలువు వస్తువులపై ఎలాంటి నీడ చూపనప్పుడు అరుదుగా జరిగే జీరో షాడో డేను మంగళవారం సీబీఐటీ విద్యార్థులు పరిశీలించారు. మధ్యాహ్నం 12.12 గంటల నుంచి 12.14 గంటల మధ్య జీరో షాడో డే జరిగిందని అధ్యాపకులు డాక్టర్ ఎస్‌వి నాగప్రపూర్ణ, డాక్టర్ జీఎస్‌ఆర్ ప్రసాద్, డాక్టర్ ఆర్. ప్రసన్నరాణి పేర్కొన్నారు.



జీరో షాడోను గమనిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

## సుపరిపాలన అందించడమే బీజేపీ లక్ష్యం



కార్యక్రమంలో పాల్గొన్న రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

**బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్**

గచ్చిబౌలి: ప్రజలకు సుపరిపాలన అందించడమే బీజేపీ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ టెలికామ్‌నగర్‌లో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి టెలికామ్‌నగర్‌లో గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో రాక్షస కుటుంబపాలన నడుస్తోందని, దీనికి వచ్చే ఎన్నికలలో ప్రజలకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. 2014కు ముందు రాష్ట్రంలో రూ. 60 వేల కోట్ల అప్పులు ఉండగా ప్రస్తుతం రూ. 5 లక్షల కోట్లకు పైగా అప్పుల చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇది రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ సాధించిన ప్రగతి అని విమర్శించారు. దళితులకు భూముల పంపిణీ, దళితబంధు, గిరిజనబంధు, ఇంటికో ఉద్యోగం, ఇలా ఎన్నో స్కీమ్‌లను ప్రకటించి వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి తిరుగుతూ ఆయా కాలనీల్లో సమస్యలను కూడా గుర్తిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డి రవిందర్‌రెడ్డి, దినేష్‌యాదవ్, బాలు, దశరథ్, రక్షిత్, మురళి, రాఘవేంద్ర, హరినాథ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాధాకృష్ణయాదవ్, రమేష్, ఎల్లేష్, అనీల్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

## అర్హులకే బోజగుట్ట డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్వాన్ ఇన్‌చార్జి జీవన్ సింగ్

గోల్కొండ: బోజగుట్టలో అర్హులైన వారికే డబుల్ బెడ్‌రూంలు కేటాయిస్తామని బీఆర్ఎస్ కార్వాన్ ఇన్‌చార్జి టి. జీవన్ సింగ్ అన్నారు. మంగళవారం ఆయన గుడిమల్కాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి బోజగుట్ట డబుల్ బెడ్‌రూంల కేటాయింపుపై మాట్లాడారు. బోజగుట్టలో 500 మంది స్వచ్ఛందంగా తమ ఇళ్లను డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి ఇచ్చారని, ఈ విషయంపై న్యాయంస్థానం కూడా ఈ 500 మందికే ఇళ్లు కేటాయించాలని స్పష్టంగా తీర్పునిచ్చిందన్నారు. అయితే కొందరు అసలు విషయాలను దాచి బోజగుట్ట డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు.

### వడగండ్ల వాన

శంషాబాద్ రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అక్కడక్కడ చిన్నపాటి వడగండ్లు కూడా పడ్డాయి. రామంజాపూర్, మల్కారం, కేబీ.దొడ్డి, సుల్తాన్‌పల్లి, నర్కూడ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

# పేదల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్**



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: తెలంగాణ ప్రభుత్వం పేదల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌లో నిర్మించిన 60 డబుల్ బెడ్రూమ్‌లకు లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. వెయ్యి మంది దరఖాస్తుదారులకు గాను 113 మందిని అర్హులుగా గుర్తించి అందులో 23 ఎస్సీ, ఎస్టీ కోటా, 4 మైనార్టీ కోటా, మిగిలిన 33 ఇళ్లను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి వివక్ష లేకుండా పారదర్శకంగా డబుల్ బెడ్రూమ్‌లను ఎంపిక చేస్తుందని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అర్హులందరికీ ఇళ్లు అందేలా చూస్తానని దశల వారీగా ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, ఎమ్మార్వో రాజశేఖర్, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షులు సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు నిఖిలసంగారెడ్డి, ప్రశాంత్‌నాయక్, అస్లాం పాల్గొన్నారు.

**మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి**



లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న ఎమ్మెల్యే

నియోజకవర్గంలోని అన్ని కాలనీలు, బస్తీల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పేర్కొన్నారు.బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు డివిజన్లలో మంగళవారం ఆయన పలు అభివృద్ధి పనులకు మేయర్ మహేందర్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మెరుగైన వసతులు కల్పించేందుకు ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేయిస్తున్నట్లు వెల్లడించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం 3.10 కోట్లతో పనులను ప్రారంభించామని పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన వద్దకు తీసుకువస్తే వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్, కార్పొరేటర్లు చంద్రశేఖర్, పద్మావతిపాండు, సంతోషిరాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పద్మావతిపాపయ్య, నిఖిలసంగారెడ్డి పాల్గొన్నారు.

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నేడు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్‌తో శంకుస్థాపన చేస్తారని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు.